క్లుప్తంగా

మునిసిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు



పెనమలూరు: పోరంకిలోని తాడిగడప మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపాలిటీ కార్మికులకు ఉచిత వైద్య శనివారం శిబిరం నిర్వహించారు. క్యాపిటల్ ఆస్పత్రి, త్రినేత్ర ఆస్పత్రి వైద్యులు మున్సిపాలిటీ కార్మికులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. బీపీ, షుగర్, కంటి పరీక్షలతో పాటు ఇతర వైద్య పరీక్షలు నిర్వహించారు. దాదాపు 150 మందికి వైద్య సేవలు అందాయి. అనంతరం వైద్యులను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సత్కరించారు. మున్సిపల్ కమిషనర్ ఎస్కే నజీర్, అసిస్టెంట్ కమిషనర్ కిరణ్, టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, పలువురు పాల్గొన్నారు.

స్వామివారిని దర్శించుకున్న మంత్రి శుభాష్

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలోని పార్వతీ సమేత రామలింగేశ్వస్వామి దేవస్థానంలో శనివారం స్వామివారిని మంత్రి వాసంశెట్టి శుభాష్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. మంత్రి స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. పూజల అనంతరం మంత్రిని ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఈ నెల 22వ తేదీ నుంచి దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ఎస్.భవాని తెలిపారు. శనివారం మాస శివరాత్రి సందర్భంగా స్వామివారికి అభిషేకాలు పూజలు చేశారు. దాత సంగా నరసింహారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్‌పై అవగాహన



గన్నవరం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం లయన్స్‌క్లబ్ ఆఫ్ గన్నవరం శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మైక్రో లింక్ ఇండస్ట్రీ ఎండీ మిరియాల సాంబశివరావు మాట్లాడుతూ సాంకేతిక విద్యను అభ్యసించిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని చెప్పారు. ఉన్నత ఉద్యోగాల కోసం విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు దండమూడి శ్రీనివాసరావు, సభ్యులు కాకర్లపూడి సాంబశివరావు, అట్లూరి దిలీప్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వీవీ. కృష్ణమోహన్, విభాగాధిపతులు బీ. మురళీ, బాలభాస్కర్, మాధవీ. కే. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తల్లీపిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఆరోగ్యకరమైన మహిళే శక్తివంతమైన కుటుంబానికి పునాది అని ఐసీడీఎస్ వీరవల్లి సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.ఝాన్సీరాణి అన్నారు. బాపులపాడు మండలం కోడూరుపాడు, కొత్త రేమల్లే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసాన్ని పురస్కరించుకుని 'కుటుంబ ఆరోగ్యంతో పురుషుల భాగస్వామ్యం'పై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. తల్లీపిల్లల ఆరోగ్యంపై పురుషులు శ్రద్ధ వహించినప్పుడే కుటుంబం బలపడుతుందని చెప్పారు. గర్భిణుల పోషణ, పసిపిల్లల సంరక్షణలో కేవలం మహిళలే కాకుండా పురుషుల భాగస్వామ్యం కూడా ఎంతో కీలకమని ఝాన్సీరాణి పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాల ఆహార పదార్థాల తయారీపై ప్రదర్శన నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీలత, పి.లక్ష్మి, లక్ష్మీదేవి, ఎం.సుభాషిణి, కె.నవీన, ఏఎన్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గాలీవాన బీభత్సం

కంకిపాడు: ద్రోణి ప్రభావంతో వాతావరణంలో ఒక్కసారిగా మార్పు వచ్చింది. శనివారం సాయంత్రం ఆకాశం పూర్తిగా మేఘావృతమై గాలివాన బీభత్సం సృష్టించింది. వర్షానికి ఈదురుగాలులు, మెరుపులు తోడవ్వటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పెనమలూరు నియోజకవర్గం వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఈడుపుగల్లు, కంకిపాడు పరిసరాల్లో రోడ్డు మార్జిన్‌లలోని చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. వర్షం కారణంగా బస్టాండు సెంటరు, రైతుబజారు, గన్నవరం రోడ్డు పరిసరాలతో పాటుగా కంకిపాడు, పునాదిపాడు అండర్ పాస్‌లలో నీరు నిలిచిపోయి వాహనదారులు అసౌకర్యానికి గురయ్యారు. రెండున్నర గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

అర్చకుల ఆత్మీయ సమ్మేళనం

లబ్బీపేట(విజయవాడతూర్పు): టీటీడీ సహకారంతో ఎస్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్మితమైన దేవాలయాల ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార అర్చకుల ఆత్మీయ సమ్మేళనం శనివారం లబ్బీపేట ఓ ఫంక్షన్ హాలులో జరిగింది. ఈ సమ్మేళనంలో 651 మంది అర్చకులు పాల్గొన్నారు. ఎస్ఎస్ఎఫ్ అఖిల భారత కార్యదర్శి శ్యాంప్రసాద్, ఎస్ఎస్ఎఫ్ అధ్యక్షుడు విష్ణు, శ్రీకమలానందభారతిస్వామి, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, గోకరాజు గంగరాజు పాల్గొన్నారు.

ఆలయాలకు దసరా శోభ



విద్యుత్ దీపాల అలంకరణలో శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయం

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ దేవస్థానం దసరా మహోత్సవాలకు ముస్తాబైంది. ఆలయంతో పాటు అమ్మవారి కల్యాణ వేదికను విద్యుత్ దీపాలతో అలంకరించారు. పదకొండు రోజుల పాటు జరిగే దేవి శరన్నవరాత్రులకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ తెలిపారు. ఈ ఏడాది అమ్మవారి కల్యాణ వేదికలో మహోత్సవాలు జరపనున్నట్లు తెలిపారు. రోజూ ఉదయం, సాయంత్రం సామూహిక లలిత సహస్రనామ పారాయణం, కుంకుమార్చనలు జరుగుతాయని చెప్పారు.

గాయత్రి మందిరంలో

స్థానిక సొసైటీపేటలోని శ్రీగాయత్రి అమ్మవారి మందిరంలో ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు శ్రీదేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలను నిర్వహించినట్లు మందిర కమిటీ అధ్యక్షుడు కేవీఆర్.కిషోర్ తెలిపారు. అమ్మవారు ఈ నెల 22వ తేదీ నుంచి పలు అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. రోజూ గోపూజ, కుంకుమార్చనలు, హోమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

యనమలకుదురు కనకదుర్గ అమ్మ వారి ఆలయంలో

పెనమలూరు: యనమలకుదురు గ్రామం లాకు సెంటర్‌లో వేంచేసి ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాలు నిర్వహించనున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి ప్రసాదరావు తెలిపారు. ఆయన శనివారం వివరాలు తెలుపుతూ ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు అమ్మవారి వివిధ రకాల అలంకరణలతో ఉత్సవాలు ఉంటాయన్నారు. ఈ నెల 22వ తేదీన శ్రీ బాలత్రిపుర సుందరీదేవి, 23న శ్రీగాయత్రిదేవీ, 24న శ్రీఅన్నపూర్ణాదేవీ, 25న శ్రీకాత్యాయినిదేవీ, 26న శ్రీ మహాలక్ష్మిదేవి, 27న శ్రీలలితా త్రిపురసుందరీదేవి, 28న మహాచండీదేవీ, 29న శ్రీసరస్వతీ దేవీ, 30న శ్రీదుర్గాదేవీ, ఒకటో తేదీన మహిషాసుర మర్ధినీదేవీ, 2న దసరా రోజు శ్రీరాజరాజేశ్వరీదేవి అలంకరణ చేస్తామన్నారు.



యనమలకుదురులో కనకదుర్గ అమ్మవారి ఆలయం

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న డీవైఈఓ, ఎంపీడీఓ, సర్పంచి



యూనివర్శిటీలో మొక్క నాటుతున్న రిజిస్ట్రార్ రవిచంద్



ఉప్పలూరులో సీతమ్మను సత్కరిస్తున్న సచివాలయ సిబ్బంది

గన్నవరం: స్థానిక రాయ్‌నగర్‌లోని ఎంపీపీ పాఠశాల, జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఆయా పాఠశాలల ఆవరణలో ఎంపీడీఓ టి. స్వర్ణలత, గుడివాడ డీవైఈవో కొండా రవికుమార్, సర్పంచి నిడమర్తి సౌజన్య మొక్కలు నాటారు. అనంతరం భోజనానికి ముందు చేతుల శుభ్రం చేసుకోవడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పర్యవేక్షించారు. మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని డీవైఈఓ వంట ఏజెన్సీకి సూచించారు. ఎంఈఓ- 2 ఎం.కమల, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని సిద్ధార్థ డీమ్డ్ టూబీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.రవిచంద్ అన్నారు. కానూరు సిద్ధార్థ డీమ్డ్ టూబీ యూనివర్సిటీలో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమలో భాగంగా యూనివర్సిటీ ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతి విద్యార్థి బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేయాలని సూచించారు. కాదంబరి, బాదం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ జె.శివరామ్ ప్రసాద్, అధ్యాపకులు డాక్టర్ కొల్లా నరేంద్ర, ఏవో కె.కేశవరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంకిపాడు: గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉప్పలూరు సర్పంచ్ లాం సోనియా విజ్ఞప్తి చేశారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం శనివారం ఉప్పలూరులో నిర్వహించారు. మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. గృహ కంపోస్టు తయారీ దారు తాటి సీతమ్మను సత్కరించారు. కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు, చలసాని రాధాకృష్ణ, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థలను ఏర్పాటు చేయలేకపోయా..

రామవరప్పాడు: ప్రభుత్వంతో చర్చించి నియోజకవర్గంలో పలు కార్పొరేట్ సంస్థల ఏర్పాటుకు అనుమతులు తీసుకువచ్చిన పలు కారణాలతో అవి ఆగిపోవడం బాధాకరమని గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. విజయవాడరూరల్ మండలం నిడమానూరు పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు, ఇతర సిబ్బందిని సన్మానించి ఇన్సూరెన్స్ సర్టిఫికెట్లను, పీపీఈ కిట్లు పంపిణీ చేశారు. వెంకట్రావు మాట్లాడుతూ భూమి కొరత వల్ల ట్రిబుల్ ఐటీ ఏర్పాటుకు ఆటంకం కలిగిందన్నారు. రామవరప్పాడులో రూ.70 లక్షల వ్యయంతో భవనం నిర్మించేందుకు రామోజీ ఫౌండేషన్ ముందుకు రాగా ఇక్కడి రాజకీయ కారణాలతో వెనుకడుగు పడిందన్నారు. ఎనికేపాడులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణానికి అనుమతులు తీసుకొస్తే అదీ కార్యరూపం దాల్చలేదన్నారు. నియోజకవర్గంలో ఆశించిన స్థాయిలో పనులు చేయడం లేదని అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు గ్రామాలకు చెందిన నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆహారపు అలవాట్లపై దృష్టి పెట్టాలి



కానూరులో మాట్లాడుతున్న సీడీపీవో బేబీసుకన్య



వణుకూరులో ర్యాలీ చేస్తున్న దృశ్యం

పెనమలూరు: చిన్నారుల ఆహారపు అలవాట్లపై తల్లులు దృష్టిపెట్టాలని సీడీపీవో కె.బేబీసుకన్య అన్నారు. కానూరు అంగన్‌వాడీ కేంద్రంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసం 2025లో తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులకు పౌష్టికాహారం ఇవ్వటం వలన ఆరోగ్యంగా ఎదుగుతారన్నారు. దీని వలన రోగ నిరోధకశక్తి పెరుగుతుందని తెలిపారు. చిన్నారుల వివరాలు డిజిటలీకరణ చేయటం వలన సమగ్రపోషణకు అవకాశం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జి.విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త పి.రజని, ఆశ వర్కర్లు, తల్లులు, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు. వణుకూరులో జరిగిన 8వ రాష్ట్రీయ పోషణ మాసంలో గ్రామ సర్పంచి చెక్క విజయ మాట్లాడుతూ ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ ఎకౌంట్ రిజిష్ట్రేషన్ (అపార్) ఐడీ నమోదు చేసుకోవాలని సూచించారు. ఇది భారతదేశంలో విద్యార్థులకు శాశ్వత గుర్తింపు సంఖ్య అని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఎకౌంట్‌తో ఆరోగ్య సంరక్షణ సులభతరం చేయటానికి కేంద్ర ప్రభుత్వం 14 అంకెలతో డిజిటల్ హెల్త్ గుర్తింపు కార్డు ఇస్తుందన్నారు. తల్లులు, గర్భిణులు కేంద్ర ప్రభుత్వం నుంచి అందే పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి వి.పద్మావతిదేవీ, గ్రామ సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జాగృతి పథకంపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటశివయ్య

గన్నవరం: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాగృతి పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథి తహసీల్దారు కే వెంకటశివయ్య మాట్లాడుతూ ప్రతి పేద, బలహీన, వెనుకబడిన వర్గాలకు ఉచిత న్యాయ సహాయం అందించడం ఈ పథకం లక్ష్యమన్నారు. తద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం అందుతుందన్నారు. రెవెన్యూ, పోలీస్, న్యాయ సంబంధిత వివాదాలను న్యాయ సేవాధికార కమిటీ ద్వారా త్వరితగతిన పరిష్కరించుకోవాలని సూచించారు. ఎంపీడీఓ టి.స్వర్ణలత, బార్ అసోసియేషన్ కార్యదర్శి రామకూరి ప్రకాశరావు, కోశాధికారి విమల్ కుమార్, న్యాయవాది నల్లమోతు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: లయన్స్‌క్లబ్ ఆఫ్ హనుమాన్‌జంక్షన్ ఆధ్వర్యంలో బాపులపాడు మండలం వేలేరులోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఆరవ తరగతి నుంచి పదోవ తరగతి వరకు ప్రభావంతులైన ఐదురుగు విద్యార్థులకు ఒకోక్కరికి రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.25 వేలు ఉపకార వేతనాలను అందజేశారు. ప్రవాసాంధ్రులు వల్లంకొండ కిరణ్, రఘుచరణ్ సోదరుల తండ్రి సత్యనారాయణ జ్ఞాపకార్థం వారి మిత్రుడు మత్తి రాంబాబు చేతుల మీదగా శనివారం పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ సీనియర్ సభ్యులు నందిగం వెంకటేశ్వరరావు, నండూరు సత్య వెంకటేశ్వరశర్మ, కలపాల రంగారావు, క్లోపల్లి నారాయణరావు, మాకినేని శ్రీనివాసరావు, అక్కినేని రాఘవేంద్రరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొమ్మా విజయ్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉత్తమ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

అభ్యసన సామర్థ్యాలను పెంచాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: పిల్లల అభ్యసన సామర్థ్యాలను పెంచటానికి ప్రతి ఉపాధ్యాయుడు అంకితభావంతో పని చేయాలని మండల పరిశీలకుడు, అంగలూరు డైట్ అధ్యాపకుడు జోజిబాబు అన్నారు. స్థానిక నూజివీడు రోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో శనివారం జరిగిన క్లస్టర్ కాంప్లెక్స్ మీటింగ్‌కు ఆయన హాజరయ్యారు. పిల్లల్లో అంతర్గత నైపుణ్యాలు, ప్రతిభను గుర్తించేందుకు ఉపాధ్యాయులు చొరవ చూపాలని ఆయన కోరారు. విద్యార్థులను ఆకట్టుకునే విధంగా పాఠ్యాంశాలను బోధించాలని సూచించారు. విద్యాశాఖ అధికారుల సూచనల మేరకు పాఠశాల అభ్యున్నతి పైనా ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలని జోజిబాబు పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రొఫెసర్ శ్రేయశ్రీదాస్‌కు డాక్టరేట్



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు విజయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మహిళా కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ శ్రేయ శ్రీదాస్ డాక్టరేట్ అవార్డు అందుకోవడం పట్ల శనివారం పలువురు అభినందించారు. వీఐటీ అమరావతి విశ్వవిద్యాలయంలో 'ఎన్‌హెన్సింగ్ సిస్టమ్ ప్రొఫిటబులిటీ అండ్ సోషల్ వెల్‌ఫేర్ ఇన్ డెరిగ్యూలెటెడ్ మార్కెట్ ఎనర్జి సోరేజ్ సిస్టమ్ అండ్ మెషిన్ లెర్నింగ్ టెక్నిక్స్' అంశంపై డాక్టర్ జయేంద్రకుమార్ మార్గదర్శకత్వంలో పరిశోధన చేసి పీహెచ్‌డీ అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ తూమాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ శ్రేయ శ్రీ దాస్‌కు సెంట్రల్ యూనివర్శిటీలో ఎంటెక్ పూర్తి చేసి భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నట్లు గుర్తు చేశారు. అరుదైన అంశాన్ని తీసుకుని పరిశోధించి డాక్టరేట్ సాధించిన శ్రేయ శ్రీ దాస్‌ను కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు.

ముగిసిన అంతర్జాతీయ సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎస్ శ్రీనివాస్

నున్న(విజయవాడరూరల్): వికాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ నున్న ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన మొదటి అంతర్జాతీయ సదస్సు శనివారం ముగిసింది. రెండు రోజుల సదస్సులో మొత్తం 93 ఆన్‌లైన్ పేపర్ ప్రెజెంటేషన్స్, 25 ఆఫ్‌లైన్ పేపర్ ప్రెజెంటేషన్స్ మొత్తం 118 పత్ర సమర్పణలు జరిగినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎస్ శ్రీనివాస్ తెలియజేశారు. వాటిలో 11 ఉత్తమ పత్రాలను ఎంపిక చేసి సత్కరించారు. ఈ ఉత్తమ పత్రాలు కృత్రిమ మేధ అనువర్తనాలు, డేటా భద్రత, సైబర్ సెక్యూరిటీ, ప్రత్యామ్నాయ ఇంధనాలు, ఆధునిక నగర నిర్మాణం, వ్యవసాయం, ఫార్మా లైఫ్‌సైన్స్‌లో ఐటీ వినియోగం వంటి నూతన సాంకేతిక రంగాలకు సంబంధించినవిగా ఆయన తెలియజేశారు. అనంతరం విజేతలకు ఉత్తమ పత్ర అవార్డులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి ఎస్.సత్యనారాయణరెడ్డి, ప్రొఫెసర్ డాక్టర్ చల్లా కిషోర్‌రెడ్డిని సన్మానించి, ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందజేశారు. పలువురు అధ్యాపకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కౌలురైతులందరికీ అన్నదాత సుఖీభవ వర్తింప చేయాలి

కంకిపాడు: కౌలురైతుల చట్టం మార్చాలని, వాస్తవ సాగుదారులైన కౌలురైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపచేయాలని కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు డిమాండ్ చేశారు. కంకిపాడులోని మండేపూడి భవన్‌లో కౌలురైతు సంఘం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ వ్యవసాయంలో కౌలురైతులు 80 శాతం మంది ఉన్నారని, కౌలురైతుల చేతుల్లోనే సాగు సాగుతోందన్నారు. కౌలు రైతుల చట్టంలో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలురైతులకు కౌలు గుర్తింపు కార్డులను జారీ చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో కౌలురైతులకు అండగా ఉంటామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఆ హామీలను విస్మరిస్తోందని విమర్శించారు. కౌలురైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న 'ఛలో విజయవాడ' కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ సందర్భంగా బ్రోచర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జె.రవి, కార్యదర్శి వి.మరియదాను, నాయకులు వి.జాన్‌మోజేస్, వి.శివశంకర్, ఎం.చంటిబాబు, వి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ వీఆర్‌ఏల ధర్నా

ఉయ్యూరు: వీఆర్‌ఏల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సంఘం కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెన్నా వెంకటేశ్వరరావు కోరారు. వీఆర్‌ఏల సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉయ్యూరు ఆర్‌డీఓ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వీఆర్‌ఏలను వీఆర్‌ఓలుగా పదోన్నతి కల్పించాలన్నారు. పార్ట్ టైం ఉద్యోగుల పేరుతో అరకొర వేతనాలు ఇస్తూ ఫుల్‌టైం పనిచేయి స్తున్నారన్నారు. తహసీల్దార్, ఆర్‌డీఓ కార్యాలయాల్లో వీఆర్‌ఏలకు నైట్ డ్యూటీలు వేయటం మానుకోవాలని సూచించారు. మంత్రి నారా లోకేష్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు కేవైకే రెడ్డి, ఏడుకొండలు, రాజేష్, తదితరులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం ఆర్‌డీఓ హెలా షారోన్‌కు వినతి పత్రం అందించారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి



వణుకూరులో రైతులకు పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న ఏవో శైలజ

పెనమలూరు: రైతులు సమగ్ర పోషణ యాజమాన్య పద్ధతులు పాటించాలని ఎంఏవో కనకమేడల శైలజ అన్నారు. వణుకూరు గ్రామంలో శనివారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు సాగు సమయంలో పూర్తి అవగాహనతో ఉండాలన్నారు. మిత్ర, శత్రు పురుగుల నిష్పత్తి ఉపయోగం గురించి రైతులను వివరించారు. రైతులు అధిక ఎరువులు వాడటం వలన సాగు ఖర్చు పెరుగుతుందని, ఈ విషయంలో రైతులు అధికారుల సూచనలు పాటించాలని వివరించారు. మండల పరిధిలో పెదపులిపాక, పోరంకి, వణుకూరు రైతుసేవా కేంద్రాలలో యూరియా అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

150 మంది మహిళలకు వైద్య పరీక్షలు



బోళ్లపాడులో అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఉయ్యూరు రూరల్: మండలంలోని బోళ్లపాడులో శనివారం స్వస్థ్ నారి- సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమం నిర్వహించారు. కాటూరు పీహెచ్‌సీ వైద్యులు గ్రామంలో 150 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. మహిళలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ స్టాల్‌ను అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో కాటూరు పీహెచ్‌సీ వైద్యులు శివరామకృష్ణ, బోళ్లపాడు ఏఎన్ఎం రోహిణి, వెల్నెస్ సెంటర్ సీహెచ్‌ఓ శివకృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బేబీ సరోజిని, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి గ్రామ పంచాయతీలో శనివారం స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక, ఏఎంసీ డైరెక్టర్ కానూరి శేషుమాధవి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, సమాజం బలంగా ఉంటుందని చెప్పారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కే. ఫణికుమార్, మండల అధ్యక్షుడు నీలం అశోక్, పలువురు అధికారులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

మేధస్సును సక్రమంగా ఉపయోగిస్తేనే అభివృద్ధి



పెనమలూరు: మానవ మేధస్సును సక్రమంగా ఉపయోగిస్తేనే అభివృద్ధి సాధ్యమని అడ్వాన్స్ రీసెర్చ్ సెంటర్ (ఏఆర్‌సీ) అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ ఎల్.రామకృష్ణ అన్నారు. కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. సమాజాభివృద్ధికి మానవ మేధస్సు చాలా కీలకమన్నారు. కంప్యూటింగ్, సర్ఫేస్ ఇంజినీరింగ్, పరిశ్రమల అన్వయాలతో మంచి ఫలితలు సాధించవచ్చని వివరించారు. పరిశ్రమలలో అనుభవాల ఆధారంగా విద్యార్థులు లోతైన విజ్ఞానం సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, ప్రొఫెసర్ డాక్టర్ ఎం.శ్రీలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దార్శనికుడు గురజాడ

లబ్బీపేట(విజయవాడతూర్పు): మహాకవి గురజాడ వెంకట అప్పారావు 163 వ జయంతిని పురస్కరించుకుని శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులు శనివారం ఘనంగా నివాళులర్పించారు. తొలుత ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం మాట్లాడుతూ ఆధునిక మహిళలు చరిత్రను తిరిగి రాస్తారన్న దార్శనికుడు గురజాడ అని అన్నారు. ఆయన రచించిన కన్యాశుల్కం నేటికీ సమాజానికి స్ఫూర్తిమంతంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.